
# వేస్తున్న అడుగు ఎటు?




నందుల సుశీలాదేవి

సుభద్రకు అలవాటుగా అయిదుగంటలకే మెళకువ వచ్చేసింది

నిద్ర పూర్తిగా తరగని కళ్ళకు ఎదురుగా టేబిల్ మీద సన్న మల్లె పూలదండలు మసగ్గా కనపించాయి

డివోగా రిటైరయిన తనని ఉద్యోగ రీత్యా సమస్యలు మరి వేధించవు. జిల్లాలోని పాఠశాలల తణికీ, విద్యా వ్యవహారాలు, కేంపులు వంటి బాదరబందీలు లేకుండా హాయిగా యింక యింటిపట్టుని వుండిపోవచ్చును

తన ఆలోచనలతు తనకే నవ్వు వచ్చింది.

అరవై ఏళ్ళ రామారావూ, ఏభై అయిదేళ్ళ తనూ యౌవన కాలమంతా వుద్యోగరీత్యా చాలా కాలం వేరువేరుగానే గడిపేసేరు.

వో నాల్గయిదు సంవత్సరాలుగా బదిలీలు లేకుండా స్థిరంగా స్వంత వూళ్ళో వుండగలుగుతోంది.

సుభద్ర లేచి కూర్చుంది.

రామారావు భార్యవైపు చూసి అన్నాడు.

"అప్పుడే లేచి ఏంచేయాలి? హాయిగా రెస్టుతీసుకో"

సుభద్ర మళ్ళీ కళ్ళుమూసుకుంది. అలవాటు లేక నిద్రరావటం లేదు.

ప్రొద్దుటే అదరాబాదరా లేవటం, అర్జెంటు ఫైల్సు చూసుకోవటమో, కేంపుకి ప్రయాణమవుతూనే ప్రతి వుదయం హడావుడిగా గడిచిపోయేది.

ఇంక పడుకోలేక మొహం కడుక్కొని వంటింట్లోకి వచ్చింది.

అప్పుడే నిద్రలేచిన లక్ష్మి నెమ్మదిగా గొణిగింది. "ఈ రోజు అప్పుడే లేవరేమోనని బద్ధకించాను. ఇంకా కాఫీ డికాక్షన్ తీయలేదు."

ముందు వరండాలో పడక కుర్చీలో వచ్చి కూర్చొంది సుభద్ర. లక్ష్మి వేడి వేడి కాఫీ తెచ్చిపెట్టింది.

ఎనిమిదయితే కాని పేపరు రాదు.

కాఫీ తాగి స్నానం చేసి వచ్చినా యిళ్ళంతా నిశ్శబ్దంగానే వుంది.

భర్త ఎనిమిది దాటితే కాని నిద్ర లేవడు. రాత్రి పొద్దుపోయేవరకూ క్లబ్బులో గడిపి, పగలంతా కేసులూ, సాక్షులూ అంటూ రోజు గడిపేస్తాడు రామారావు

విజయ లేచినట్లుంది

"లక్ష్మి! కాఫీ" అని అరుస్తోంది.

రాత్రి వంటిగంటా, రెండూ వరకూ చదివి, ప్రొద్దుట ఆలస్యంగా లేచి, ఆదరాబాదరా తయారయి మెడికల్ కాలేజికి పరుగెడుతుంది కూతురు.

సాయంత్రం సినిమాలూ, స్నేహితులతో కాలక్షేపం చేస్తుంది.

చదువులో వెనకబడి వుండదు కనుక ఆమె స్నేహితులతో ఎక్కువ కాలం గడిపినా తండ్రి ఏమీ అనడు.

సుభద్రకు భరింపరాని వంటరితనం అనిపించింది.

భర్త దినచర్యలో కాని, కూతురి దైనందిన కార్యక్రమంలో కాని తన ప్రమేయం లేదు.

ఇన్నేళ్ళూ వుద్యోగపు వత్తిడులలో గడిపివేసిన తనకు యీరోజు హఠాత్తుగా తీర్థంలో తప్పిపోయిన పిల్లలా మనస్సంతా అయోమయంగా వుంది.

రామారావు వచ్చి దగ్గర్లో కూర్చున్నాడు. "ఏ లేడీస్ క్లబ్బులోనైనా చేరు సుభద్రా! పొద్దుపోతుంది."

సుభద్ర చివ్వున తలెత్తింది.

తనకు మహిళా సంఘాలన్నా, క్లబ్బు లన్నా విపరీతమైన చికాకు.

ఆ విషయం రామారావుకి తెలుసు. ఈనాడు ఈ సలహా యిచ్చేదంటే నమ్మ లేకపోతోంది. సుభద్ర నెమ్మదిగా అంది

"ఇంట్లో హాయిగా వుండాలని ఎన్నాళ్ళనుండో నా కోరిక. ఇన్నాళ్ళకు ఆ విశ్రాంతి లభించింది "

రామారావు కళ్ళల్లో అరసెకను కాలం సానుభూతి తళుక్కుమంది

నెమ్మదిగా అన్నాడు.

"ఈ విశ్రాంతి భరించడం కష్టం సుభద్రా! ఏమయినా మంచి కాలక్షేపం ఏర్పరచుకో!"

విజయ కాలేజికి వెళ్ళిపోయింది.

పదకొండు అవుతుంటే రామారావు కోర్టుకి వెళ్ళిపోయేడు.

ఇంట్లో లక్ష్మి, తనూ మిగిలేరు.

వంట అయిందని లక్ష్మి భోజనానికి పిలిచినా లేవబుద్ధి కాలేదు.

చేతికందిన నవల చదువుతూ కూర్చుంది.

ఎప్పటికో లక్ష్మి భోజనానికి పిలిచింది

భోజనం చేస్తుంటే కూరలో వుప్పు ఎక్కువగా అనిపించింది.

సాంబారు మాడినట్లుంది.

ఇన్నాళ్ళనుండీ తను తీరిగ్గా ఎప్పుడూ భోజనం చేయలేదు. ఎప్పుడూ తొందరే! అదే హడావుడిలో విజయా, రామారావూ తినేస్తూ వుండి వుంటారు.

తాను చేసే పనేముంది?

లక్ష్మిని మానిపించేస్తే?

ఎప్పుడో యిరవై ఏళ్ళ క్రిందట తాను వంటచేసేది కాని యీ మధ్య కాలంలో కాఫీ కూడా తాను పెట్టుకోలేదు.

నిజమే!

రామారావు అన్నట్లు విశ్రాంతి అనేది ఎరుగని తనకు హఠాత్తుగా యింత విశ్రాంతి దొరికితే తాను భరించ లేకపోతోంది.

మర్నాడు ఉదయం విజయ లేచే సరికి కాఫీ చేసి యిచ్చింది.

విజయ నొచ్చుకుంటూ అంది:


"నువ్వెందుకు మమ్మీ! అవస్థ పడతావు. లక్ష్మి తెచ్చేదిగా! లేకపోతే నేనే చేసుకొనే దానిని. నువ్వు రెస్టు తీసుకో" అంటూ అక్కడనుండి వెళ్ళి పోయింది.

ఎవరి పనులు వాళ్ళు చేసుకోవటం పిల్లలిద్దరికీ తనే అలవాటు చేసింది.

అందుకనే కొడుకు యీనాడు కష్టపడ కుండా స్టేట్స్‌లో వంట దగ్గరనుండీ చేసుకొని రిసర్చి చేసుకోగలుగుతున్నాడు.

అయినా కూతురి మాటలకి ఎక్కడో సన్నగా కలుక్కుమంది.

సుభద్రకి వుద్యోగంలో నుండి రిటైర్ అయ్యాక కూతురిని పరిశీ లించడం ఓ అలవాటు అయిపోయింది.




ఇన్నాళ్ళూ అంత పట్టించుకోక పోయినా విజయ ప్రశ్నలు ఆవిడికి నచ్చడం లేదు.

ఈ బెల్‌బాటమ్స్‌లో వున్న విజయ అనాడు పొత్తిళ్ళలోపి చిన్నారి తన పాపంటే తనకే ఆశ్చర్యంగా వుంటోంది.

ఎప్పుడూ మాక్సీలు, బెల్స్ తప్ప చీరెలు కట్టదు విజయ.

ఇదే విషయం భర్తకు చెప్తే పకపకా నవ్వేడు రామారావు.

"సుభద్రా! మా అమ్మా వాళ్ళూ కచ్చాపోసి ఏడు గజాల చీర కట్టుకొని ముక్కుకు బేసరి పెట్టుకొని కొండీ సిగ చుట్టుకొనేవారు. నీ తరం వచ్చేసరికి ఆరుగజాల చీరెలూ, చక్కటి ముడీ, ఒంటి పుడక ముక్కుపుడకా వచ్చేయి. తరానికీ, తరానికీ ఎప్పుడూ మార్పు వుంటుంది. ఆ మార్పుని మనం అంగీకరించాలి. తప్పదు ..."

విజయకి నేషనల్ స్కాలర్ షిప్పు వుంది.

చదువులో చురుగ్గా వుంటుంది.

అయినా విజయ జీవిత విధానం సుభద్రకు నచ్చటం లేదు.

ఎప్పుడూ స్నేహితులూ, సినిమాలూ, పిక్నిక్‌లూ

చదివితే యింక రాత్రి అంతా కూర్చుని చదివేయటం.

రోజూ ఏరోజు పాఠాలు ఆ రోజు చదువుకోవాలని తాను టీచర్‌గా వున్న రోజుల్లో పిల్లలకు చెప్పేది. మెడిసిన్ ఆఖరి సంవత్సరంలో వున్న కూతురికి తాను యిచ్చే సలహా ఏముంది?

ఎంత అభ్యుదయ వాదంతో ఆలోచించినా విజయ తరం పిల్లలు ఎక్కువ

స్వేచ్ఛను అనుభవిస్తున్నా రేమోనని పించేది.

సుభద్రకి పరుగెడుతున్న కాలచక్రం ఒక్కసారి రిటైర్‌మెంట్‌తో ఆగిపోయి నట్లనిపిస్తోంది.

ఓ ఆదివారం విజయ తమతో టిఫిన్ తీసుకుంటూ వుంటే అంది సుభద్ర— భర్తతో "మీ ఎడిషనల్ జడ్జిగారి అబ్బాయి ఎమ్. డి. చదివేడట కదా! విజయకి ప్రయత్నిద్దామా?"

విజయ గట్టిగా నవ్వేసింది.

"డాడీ! అమ్మకి రిటైర్ అయ్యాక చాదస్తం పెరిగింది. నాకు బదులుగా మీరు వరుడిని ప్రేమించి నాకు పెళ్ళి చేయనక్కర లేదు. నాకు నేను వెతుక్కొని నాకు నచ్చితే నేను పెళ్ళి చేసుకోగలను. పెళ్ళనేది కేవలం నా వ్యక్తిగత సమస్య. తల్లీదండ్రీ చూసి, చుట్టాలూ పక్కాలూ విచారించి యీ మేటర్‌ని కాంప్లికేట్ చేయాల్సిన రోజులు కావివి. అయినా నే నింకా పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేయాలి. ఇప్పుడప్పుడే పెళ్ళీ అవీ అంటూ బాధ్యతల్లో యిరుక్కోవటం నాకిష్టం లేదు...."

సుభద్ర మాట్లాడలేక పోయింది. రామారావు వోదార్పుగా అన్నాడు.

"సుభద్రా! కొంచెం మన పెళ్ళి రోజులు గుర్తుచేసుకో! చదువుకొన్న పిల్లవనీ, శాఖభేదమనీ మా అమ్మ గొడవచేసి నూతిలో దిగుతానంది. మీ అమ్మగారు విషం తాగుతా నన్నారు. అందర్నీ కాదని మనం పెళ్ళిచేసుకున్నాం. ఆరోజున మనం మనతరంలో అభ్యుదయ వాదులం. మనలాగే మన పిల్లలకూ వ్యక్తిత్వం, స్వంత నిర్ణయాలు వుంటాయి. మన అభిప్రాయాలు వాళ్ళమీద రుద్దకూడదు. వాళ్ళ మార్గాన్ని వాళ్ళనే ఎన్నుకోనీ!"

క్రమంగా సుభద్ర యింటికి అడ్జస్ట్ అవటం మొదలుపెట్టింది.

భర్తకు శ్రద్ధగా వడ్డిస్తుంటే రామారావు నవ్వేడు


"గుడ్! ఇన్నాళ్ళకు పెళ్ళాం వడ్డిస్తుంటే తింటున్నాను. నిజంగా సుభద్రా! దాంపత్యంలో యీ సామీప్యం వుంది చూసావూ. ఇది ముసలితనంలో మరీ అవసరం సుమా! విజయ మెడిసన్ పూర్తిచేసి లైఫ్‌లో సెటిల్ అవగానే నేనూ ప్రాక్టీసు మానేస్తాను. సంపాదించింది యింక చాలు. హాయిగా కబుర్లు చెప్పుకుంటూ శేషజీవితాన్ని గడిపేద్దాం...."

సుభద్రకి రోజులు కొంచెం తొందరగానే గడుస్తున్నాయి

లక్ష్మిచేత దగ్గరుండి పనులు చేయించటం-తోట సంరక్షణ చేస్తూనూ రోజులు గడిపేయసాగింది.

ఆ రోజు యిల్లు దులపటం మొదలుపెట్టింది లక్ష్మి.

సాధారణంగా కస్తూరి గదిలోకి అడుగుపెట్టదు సుభద్ర.




బొత్తిగా కాలక్షేపం లేక అన్ని గదులూ సర్ది కిటికీ తెరలు మారుస్తూ విజయగది కూడా సర్ద సాగింది

అలమారు నిండా వుత్తరాలే!

సంస్కారం అడ్డువచ్చి విప్పి చదవ లేదుకాని ఆ బ్లూ కవర్లూ, సెంటు వాసనలూ కవర్లో ఉన్న సంగతులను వెల్లడి చేస్తూనే వున్నాయి

హఠాత్తుగా సుభద్ర దృష్టి వోచోట స్థిరంగా నిలిచిపోయింది

ఆ టాబ్లెట్స్ వున్న స్ట్రిప్‌ను చేతి లోనికి తీసుకొంది.

"ప్రిమోవలెటి....." అని చదివింది. బుధ గురు, శుక్ర వారాలు మాత్రలు వాడినట్లు వున్నాయి

ఆ రోజు శనివారం.

సుభద్రకు అరికాళ్ళలోనుండి వణుకు వచ్చింది

తనకు తెల్సినంతలో విజయకు ఆడ వాళ్ళకు వచ్చే ఏవిధమైన జబ్బులూ లేవు.

ఆ మాత్రలను వాడటంలోవి ఆంతర్యం గుండెల్లో మెరిసి విస్త్రాణ వచ్చేసింది.

అంతటితో గది సర్దటం ఆపేసి బయటకు వచ్చేసింది.

మనస్సంతా సంక్షోభిత సాగరంలా అల్లకల్లోల మయిపోయింది.

ఇదేం రకమయిన ప్రగతి పథం?

ఇటువంటి ప్రగతి కోరే ప్రతిఫలం ఏ విధంగా రూపం చెందుతుంది?

నీతినీ, అవినీతినీ వేరుచేసే అతి సన్నని సరిహద్దు రేఖను అధిగమించి వేసే యిటువంటి అభ్యుదయమా యీ తరానికి కావలసింది?

చెలియలికట్టను దాటివేసేయీ స్వేచ్ఛా

తరంగాలు సమాజాన్ని ఆమూలాగ్రం ముంచెత్తివేస్తాయో?

సుభద్రకు విపరీతమైన అలసట అన్పించింది.

భర్త రాకకోసం ఎన్నడూ ఎదురు చూడనంతటి ఆవేదనతో ఎదురు చూడ సాగింది సుభద్ర.

తనలో పెల్లుబికే యీ దావానలాన్ని పంచుకోవటానికి భర్త రావాలని ఆవిడ మనస్సు కోపుకోసాగింది.

కోర్టునుండి వచ్చిన రామారావు కొంచెం స్థిమితపడ్డాక డాబా మీదకు తీసుకొని వెళ్ళింది.

తను గమనించిన సంగతి తన అనుమానాన్ని బయటపెట్టింది.

ఈసారి రామారావు నవ్వుతూ సంగతిని ఎగరకొట్టేయ్యలేదు.

ఆ తండ్రి మొహంలోనూ నీలి నీడలు వ్యాపించేయి.

కొత్తగా వచ్చిన ఆత్మ పరిశీలనతో అంది సుభద్ర.

"విజయలో యీ పరిణామానికి కారణం-నేను వుద్యోగం చేయటం వల్ల కుటుంబానికి నా బాధ్యతను సరిగ్గా నెరవేర్చుకోలేకపోవటమంటారా?"

రామారావు వెంటనే అన్నాడు.

"అది నీ భ్రమ సుభద్రా! పసివాళ్ళుగా మన పిల్లలున్నప్పుడు నువ్వు పెద్ద వుద్యోగంలో లేవు. ఏదో ఆ స్కూల్లో వున్న అయిదు గంటలూ తప్ప నీ పిల్లల్ని నువ్వే చూసుకొన్నావు. కొంతవరకే తల్లిదండ్రుల బాధ్యత. కొంత వయస్సు వచ్చేక పిల్లల వ్యక్తిత్వాలను దిద్ది తీర్చేవాళ్ళు వాళ్ళ స్నేహితులూ వాళ్ళ వాళ్ళ పరిసరాలూ. సాంఘికంగా వచ్చే మార్పులూ వాళ్ళని ప్రభావితం చేస్తాయి. నువ్వు వుద్యోగస్థురాలివి కాకుండా యింట్లోనే వుండిపోయినా లక్ష్మి చేస్తున్న సేవ వాళ్ళకి చేసేదానివి. అంతకంటే పెద్దగా తల్లి ప్రభావం ఏ వయస్సు దాటిన పిల్లలమీద వుండదు. ఇప్పుడు విజయ తరం యువతకు అన్ని విషయాలలోనూ స్వేచ్ఛ కావాలి. అందుబాటులో నున్న వైద్య విధానాలతో వీరికి ప్రకృతి కూడా ఏ విధమైన శిక్ష వేయలేదు. ఇటువంటి స్వేచ్ఛా జీవితంలో పురకలు వేసే యువతవలన సంఘం ఏమవుతుంది అని మనం వూహించలేం. మనం కేవలం ప్రేక్షకులము మాత్రమే!"

సుభద్రకు తన్నిటితో రెండు కళ్ళూ తళతళ లాడేయి.

"మన విజయనైనా మనం అదుపులో పెట్టుకోలేమా?"

రామారావు నెమ్మదిగా అన్నాడు.

"మనవల్ల ఏమవుతుంది సుభద్రా! ఇది యీ నవతరం సృష్టిస్తున్న నూతన వ్యవస్థ. విజయ గదిలోకి నువ్వు అడుగు పెట్టకపోతే నువ్వు యీ సత్యాన్ని గమనించి వుండేదానివి కాదు కదా! మనం




ఏమీ ఎరగనట్లు వుండటమే ప్రస్తుతం మనం చేయగలిగింది. కోర్టులో ఎన్ని విడాకుల కేసులున్నాయో తెలుసా? భర్తనుస్వాతంత్రంగా ఎన్నుకొంటున్నారు తిరిగి ఆ వ్యక్తితోనే చిన్న చిన్న విషయాలకే విభేదిస్తున్నారు ఇదివరకటి లాయర్లకు ఎంతసేపూ భూమి తగాదాలూ, ఆస్తి పంపకాలూ, దత్తతలూ, భరణాలూ, పరువునష్టం దావాలూ యివే కేసులు, ఇంక ముందు ముందు లాయర్లకు విడాకుల కేసులూ, పిల్లల సంరక్షణ గురించి కీచులాటలూ, కాంపెన్సేషన్లు యీ కేసులే ఎక్కువగా వుంటాయేమో ననిపిస్తోంది."

సుభద్ర అస్తమయ సూర్యబింబాన్ని గమనిస్తూ నిశ్శబ్దంగా వుండిపోయింది.

రామారావు సిగరెట్ మీద సిగరెట్ వెలిగిస్తూ మౌనంగా వుండిపోయాడు.

క్రింద విజయ వచ్చినట్లు శబ్దం




అయింది. "లక్ష్మీ! నా సూట్ కేస్ సర్దు. వో గంటలో వెళ్ళిపోవాలి ..."

గలగల మాట్లాడుతున్న విజయ వాక్ప్రవాహం మౌనంగా కూర్చున్న ఆ దంపతులను తాకుతూనే వుంది.

సుభద్రా, రామారావూ సావిట్లోకి వచ్చేరు. లక్ష్మి ముగ్గురికీ కాఫీ తెచ్చి యిచ్చింది.

"డాడీ! నన్ను ఐ కేంప్‌లో అసిస్ట్ చేయమని మా ప్రొఫెసర్ అడిగారు. రెండురోజులు యింటికి రాను. నాకు కొంచెం డబ్బు కావాలి...."

రామారావు మొహాన్ని ప్రశాంతంగా చేసుకొని నవ్వుతూ అన్నాడు.

"క మా న్ బేబీ! ఎంత కావాలో తీసుకో."

తండ్రి పర్సులో నుండి డబ్బు తీసుకొని బేగ్‌లో పెట్టుకొంది విజయ.

"అమ్మా! సోమవారానికల్లా నేను తిరిగి వస్తాను. ఇదుగో ఐ కేంప్ జరిగే అడ్రెస్ ఇది అక్కడి ఫోన్ నంబర్."

తల్లికి రెండు కాయితాలు యిచ్చింది.

లక్ష్మి సూట్ కేస్ తీసుకొని వచ్చి విజయకు అందించింది.

సుభద్ర బలవంతాన నవ్వి అంది "జాగ్రత్త విజయా రోజూ ఫోన్ చేయి."

వెళ్ళిపోతున్న కూతురినే గమనించ సాగేరు ఆ దంపతులు.

బేగ్ భుజాన వేసుకొని, సూట్ కేస్ చేతితో పట్టుకొని వుత్సాహంతో బయటకు అడుగు పెట్టింది విజయ.